



# తొలి సమయం
దిన పత్రిక
వాస్తవమే గమ్యం.. గమనం...

సంపుటి : 02 సంచిక : 28 | మంగళవారం 28-01-2025 | ఎడిటర్ : వేముల అయోధ్య రాములు | పేజీలు : 4 | వెల : 5 రూ/..


## రాజ్యాంగ పరిరక్షణకు తామంతా
# పోరాడుతున్నాం

**- రాహుల్ వెన్నంటి నడుస్తున్నాం - ఇండోర్ ర్యాలీలో సీఎం రేవంత్ రెడ్డి**



**ఇండోర్,జనవరి27:** రాజ్యాంగ పరిరక్షణకు తామంతా రాహుల్ గాంధీ వెన్నంటి పోరాడుతున్నామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఇది ఎన్నికల ర్యాలీ కాదని, ఒక యుద్ధమని చెప్పారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం ఈ పోరాటం చేస్తున్నామని చెప్పారు. ప్రధానిగా మోదీ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి రాజ్యాంగాన్ని మార్చేందుకు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. ఇండోర్ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ ఈ పరిణామాన్ని గ్రహించే పోరాడుతున్నారని చెప్పారు. గజనీ మహమ్మద్ హిందుస్థాన్‌ను దోచుకునేందుకు యత్నించినట్టు మోదీ రాజ్యాంగాన్ని మార్చేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. బీజేపీ పేరుతో కొనసాగుతున్న బ్రిటీష్ జనతా పార్టీని ఎదుర్కొనేందుకు రాహుల్ పోరాడుతున్నారని చెప్పారు. ఇది గాంధీ పరివార్, గాడ్సే పరివార్ ల మధ్య సాగుతున్న యుద్ధమని రేవంత్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగాన్ని రక్షిస్తుందని, రిజర్వేషన్లు కాపాడుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. మధ్య ప్రదేశ్ లోని ఇండోర్ లో జరిగిన జై బాపు, జై భీం, జై సంవిధాన్ ర్యాలీకి హాజరైన ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నరేంద్ర మోదీ, అమిత్ షా రాజ్యాంగాన్ని రద్దు చేసేందుకు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. లోక్ సభ ఎన్నికల సమయంలో బీజేపీ 400 సీట్లు అడిగిందని, అబ్ కీ బార్ చార్ సౌ పార్ అనే నినాదంతోనే ప్రజల్లోకి వెళ్లిందని అన్నారు. ప్రజలు వాళ్ల కుట్రలను గ్రహించే 240 సీట్లకు పరిమితం చేశారని సీఎం రేవంత్ చెప్పారు. రాజ్యాంగం, రిజర్వేషన్ల పరిరక్షణ బీజేపీ విధానమని పేర్కొన్నారు. లోక్ సభ ఎన్నికల ఫలితాలు వెలువడ్డ నాటి నుంచి బీజేపీ నేతలు ఆందోళనలో ఉన్నారని అన్నారు. 2025 వాళ్లకు కీలకంగా మారిందని అన్నారు. బీజేపీ కుట్రలను తిప్పికొట్టేందుకే తాము జై బాపు, జై భీం, జై సంవిధాన్ ర్యాలీ నిర్వహిస్తున్నామని సీఎం చెప్పారు. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రలోనూ రాజ్యాంగం, రిజర్వేషన్ల పరిరక్షణే ధ్యేయమని చెప్పారని, దానికి కట్టుబడే కాంగ్రెస్ పార్టీ పోరాటాలు సాగిస్తోందని అన్నారు. బీజేపీకి అంబేద్కర్ పేరు అన్నా.. రాజ్యాంగం, రిజర్వేషన్లు అన్నా నవ్వులాటగా మారాయని అన్నారు. సీఎం వెంట డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి తదితరులు ఉన్నారు.

## ప్రపంచాభివృద్ధిలో భారతదేశ
# యువత కీలక భూమిక

**వీరి భాగస్వామ్యం లేకుండా అభివృద్ధిని ఊహించలేం**

**ఎన్‌సిసి ర్యాలీలో ప్రధాని మోడీ ఉద్ఘాటన**



**న్యూఢిల్లీ,జనవరి27:** ప్రపంచాభివృద్ధిలో భారతదేశ యువత కీలక భూమిక వహిస్తోందని, వీరి భాగస్వామ్యం లేకుండా ప్రపంచాభివృద్ధిని ఊహించలేమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. దశాబ్దాలుగా దేశ యువత ఎదుర్కొంటున్న సమస్యలను తొలగించేందుకు తమ ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు.ద

ఢిల్లీలోని కరియప్ప గ్రౌండ్స్‌లో సోమవారంనాడు జరిగిన నేషనల్ క్యాడెట్ కార్ప్స్ ర్యాలీలో ప్రధాని పాల్గొన్నారు. ఎన్‌సీసీ డవలప్‌మెంట్‌కు గత కొన్నేళ్లుగా ప్రభుత్వ పనితీరు తనకు చాలా సంతృప్తిని ఇచ్చిందని మోదీ అన్నారు. 170 సరిహద్దు ప్రాంతాలు, సుమారు 100 తీరప్రాంత సరిహద్దులకు ఎన్‌సీసీ క్యాడెట్లు విస్తరించారని, తద్వారా ఆయా ప్రాంతాల్లో నివసించే వారికి ఎంతో ప్రయోజనం చేకూరిందని చెప్పారు. 'ఒకే దేశం ఒకే ఎన్నికలు'పై డిబేట్‌ను ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ క్యాడెట్లు కొనసాగిం చాలని, దేశ యువత భవిష్యత్తుకు ఏకకాలంలో ఎన్నికలు కీలకమని అన్నారు. ప్రతి నెలలోనూ ఎన్నికలు జరుగుతూ పోతుంటే కాలేజీలు, విద్యాసంస్థల్లో చదువుకునే విద్యార్థులకు సమయం ఎక్కడ దొరుకుతుందని ప్రశ్నించారు. వికసిత్ భారత్' ఉద్దేశాలపై ఎన్‌సీసీ క్యాడెట్లతో సహా దేశ యువత దృష్టిసారించాలని మోదీ కోరారు. దేశ వికాశంతోనే భారత్ అంతర్జాతీయంగా ఉన్నత స్థాయికి చేరుకుంటుందన్నారు. 2014లో 14 లక్షల మంది ఎన్‌సీసీ క్యాడెట్లు ఉండగా, ఇప్పుడు ఆ సంఖ్య 20 లక్షలకు చేరుకుందని, వీరిలో 8 లక్షల మందికి పైగా మహిళలే ఉండటం గర్వకారణమని చెప్పారు. ప్రపంచంలోనే అతిపెద్ద యూనిఫార్మ్‌డ్ యూత్ ఆర్గనైజేషన్‌గా ఎన్‌సీసీ నిలవడం, డిజాస్టర్ మేనేజిమెంట్‌తో సహా అన్ని రంగాలకు ఎన్‌సీసీ సేవలు విస్తరిస్తుండటం ముదావహమని చెప్పారు.

# గద్దర్‌కు పద్మ అవార్డు ఎలా ఇస్తాం?

**నక్సలైట్లతో కలసి వందలాదిమంది బిజెపి వాళ్లను హతమార్చారు**

**ఈటెల రాజేందర్ నక్సలైటు కాదంటూ కితాబు**

**కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఘాటు వ్యాఖ్యలు**




**కరీంనగర్,జనవరి27:** ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పద్మ అవార్డుల విషయంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. గద్దర్‌కు పద్మ అవార్డు ఎలా ఇస్తామంటూ ఆయనను అవమానించేలా ఘాటు వ్యాఖ్యలు చేశారు. 'పద్మ' అవార్డుల కోసం జాబితాను పంపేటప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించి పంపాలని, గద్దర్‌కు ఎట్లా పద్మ అవార్డు ఇస్తామని ఆయన ప్రశ్నించారు. ప్రజా యుద్ధ నౌక గద్దర్‌కు పద్మ అవార్డ్ ఇవ్వకపోవడంపై తెలంగాణ ప్రభుత్వం చేస్తోన్న విమర్శలకు కేంద్రమంత్రి, బీజేపీ కీలక నేత బండి సంజయ్ కౌంటర్ ఇచ్చారు. ఎంతో మంది బీజేపీ కార్యకర్తలను, ఎన్ కౌంటర్లలో పోలీసులను పొట్టన బెట్టుకున్న వ్యక్తి గద్దర్ అని.. అలాంటి వ్యక్తికి పద్మ అవార్డు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. మావోయిస్టుగా పని చేసి ఎంతో మంది ప్రాణాలు తీసిన వారిలో గద్దర్ ఒకరని.. ఆయనకు పద్మ అవార్డు ఇచ్చేదే లేదని కుండబద్దలు కొట్టారు. సోమవారం కరీంనగర్లో బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ నక్సలైట్ కాదన్నారు. మావోయిస్టు భావజాలం వేరు.. నక్సలైట్‌గా పని చేయడం వేరని పేర్కొన్నారు. నక్సలిజంతో ఎంపీ ఈటల రాజేందర్‌కు ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. అలాగే.. నంది అవార్డుల స్థానంలో రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాలనుకుంటున్న గద్దర్ అవార్డులు మా వాళ్ళు తీసుకోరని బండి సంజయ్ స్పష్టం చేశారు. గద్దర్ కాంగ్రెస్, టీడీపీకి చెందిన నేతలను హతమార్చారని.. ఆ విషయం సీఎం రేవంత్ రెడ్డికి తెల్వదని అన్నారు. గద్దర్‌కు వ్యతిరేకంగా మాట్లాడానని.. నా దిష్టి బొమ్మ తగలబెడితే నా ఆయుష్షే పెరుగుతుందని సెటైర్ వేశారు కేంద్రమంత్రి బండి సంజయ్. 'గద్దర్ ఎంత మంది బీజేపీ కార్యకర్తలను కాల్చి చంపించారో తెలియదా..?' అని రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. నమ్మిన సిద్ధాంతం కోసం ప్రజాస్వామ్య బద్ధంగా ఆందోళన చేసిన వందల మంది బీజేపీ కార్యకర్తలను నక్సలైట్లతో కలిసి హత్య చేయించిన వ్యక్తి గద్దర్ అని బండి సంజయ్ ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ సెంటిమెంట్‌తో ప్రజలను రెచ్చగొట్టాలని చూస్తోందని, తెలంగాణ సెంటిమెంట్‌తో ఎవరు లాభపడ్డారో.. ఎవరు బలైపోయారో ప్రజలందరికీ అర్థమైందని అన్నారు. ఇటీవల కేంద్రం ప్రకటించిన పద్మ అవార్డుల్లో తెలంగాణకు అన్యాయం జరిగిందని సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. తాము గోరటి వెంకన్న, గద్దర్, జయధీర్ తిరుమలరావు, చుక్కా రామయ్య, అందెశ్రీ పేర్లు సిఫార్సు చేసినా కేంద్రం పట్టించుకోలేదని రేవంత్ విమర్శించారు. ఏపీకి 5 అవార్డులు ఇచ్చారని, తెలంగాణకు నాలుగైనా ఇవ్వాల్సిందని అన్నారు. పద్మ అవార్డుల విషయంలో చూపిన వివక్షపై కేంద్రానికి లేఖ రాస్తానని సీఎం అన్నారు. సీఎం వ్యాఖ్యలపై తాజాగా బండి సంజయ్ ఈ హాట్ కామెంట్స్ చేశారు. పద్మ అవార్డులు అర్హులకే వచ్చాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం మంచి పేర్లు పంపితే కేంద్రం పరిశీలిస్తుందని, ఏ పేరు పడితే ఆ పేరు పంపితే పద్మ అవార్డులు ఇవ్వరని సంజయ్ అన్నారు. 'గద్దర్‌కి పద్మ అవార్డు ఎలా ఇస్తాం..? ఆయన భావజాలం ఏంటి..? బరాబర్ గద్దర్‌కు ఇవ్వం. ఎందరో బీజేపీ నేతలను చంపిన వ్యక్తుల్లో గద్దర్ ఒకరు. పద్మ అవార్డులు స్థాయి ఉన్న వారికే ఇస్తాం. బీజేపీ కార్యకర్తలను, పోలీసులను చంపిన వారికి అవార్డులు ఎలా ఇస్తాం..? అని బండి సంజయ్ వ్యాఖ్యానించారు.

## తెలంగాణలో కాంగ్రెస్
# ప్రజా ప్రభుత్వం రికార్డు

**ఒకే రోజు నాలుగు సంక్షేమ పథకాల ప్రారంభం**

**6,15,677 మంది అర్హులకు లబ్ది**

**రైతు భరోసా, ఆత్మీయ భరోసాకు రూ. 579 కోట్లు విడుదల**




**హైదరాబాద్,జనవరి27:**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం మరో రికార్డు నెలకొల్పింది. ఒకే రోజు నాలుగు సంక్షేమ పథకాలను విజయవంతంగా ప్రారంభించటంతో పాటు.. అక్కడికక్కడే 6,15,677 మంది అర్హులకు లబ్ది కల్పించింది. అదే రోజున రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు ఆర్థికశాఖ రూ. 579 కోట్లు విడుదల చేసింది. లక్షలాది మంది రైతులు, వ్యవసాయ కూలీల కుటుంబాల్లో ఈ నిధులు జమ కావటంతో రాష్ట్రమంతటా ఆనందం వెల్లివిరిసింది. రాష్ట్ర ప్రభుత్వం ముందుగా ప్రకటించిన విధంగానే ప్రజా పాలనలో నాలుగు సంక్షేమ పథకాలు విజయవంతంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజునే లక్షలాది మంది ఈ సంక్షేమ పథకాలను అందుకున్నారు. గణతంత్ర దినోత్సవం రోజున రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండలాల్లో ఎంపిక చేసిన 563 గ్రామాల్లో ఈ పథకాలను ప్రభుత్వం లాంఛనంగా ప్రారంభించింది. ఽూసతి అరజీతిబిజీనాజీ: విద్యార్థులకు నాసిరకం భోజనం.. తీరు మార్చుకోని సెంట్రల్ కిచెన్ సిబ్బంది ఆయా గ్రామాల్లో ఉన్న రైతులకు రైతు భరోసా, వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఆర్థిక సాయాన్ని అప్పటికప్పుడే వారి ఖాతాల్లో జమ చేసింది. దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులందరికీ రేషన్ కార్డులు జారీ చేసింది. గూడు లేని నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందించింది. రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకున్న కుటుంబాలకు కొత్త కార్డులు జారీ చేసింది. పాత కార్డుల్లో అదనంగా సభ్యులను నమోదు ప్రక్రియను పూర్తి చేసింది. మొదటి రోజునే రాష్ట్ర ప్రభుత్వం రూ.569 కోట్ల రైతు భరోసా విడుదల చేసింది. మొత్తం 32 జిల్లాల్లో 563 గ్రామాలలో 4,41,911 మంది రైతులకు ఎకరానికి రూ.12 వేల చొప్పున పెట్టుబడి సాయం అందించింది. ఒక్క రోజులోనే మొత్తం రూ.569 కోట్లు వారి ఖాతాల్లో జమ చేసింది. మొదటి రోజునే 9,48,333 ఎకరాల విస్తీర్ణంలోని భూమికి రైతు భరోసాను చెల్లించింది. 26వ తేదీన బ్యాంకులకు సెలవు దినం కావటంతో.. 27వ తేదీ ఉదయం నుంచి ఈ రైతు భరోసా నిధులు రైతుల ఖాతాల్లో జమయ్యాయి. తొలిసారిగా రాష్ట్ర ప్రభుత్వం భూమి లేని వ్యవసాయ కూలీ కుటుంబాలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ప్రారంభించింది. ఈ పథకం ద్వారా ఏడాదికి రూ.12 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తోంది. మొదటి విడతగా రూ.6 వేలు చెల్లించింది. తొలి రోజున దాదాపు 18180 వేల వ్యవసాయ కూలీ కుటుంబాలకు ఈ నగదు సాయాన్ని వారి ఖాతాల్లో జమ చేసింది. ఈ పథకానికి తొలి రోజునే ఆర్థిక శాఖ రూ.10.91 కోట్లు విడుదల చేసింది. గత పదేండ్లుగా కొత్త రేషన్ కార్డులకు ఎదురుచూసిన తెలంగాణ ప్రజల నిరీక్షణ ఫలించింది. ప్రజా ప్రభుత్వం అర్హులైన కుటుంబాలకు రేషన్ కార్డులు జారీ ప్రారంభించింది. వీటితో పాటు పాత రేషన్ కార్డుల్లో అదనపు కుటుంబ సభ్యుల పేర్లను నమోదు చేసింది. తొలి రోజున 531 గ్రామాల్లో 15414 కొత్త కార్డులు ఇచ్చింది. వీటిలో 51912 మంది కుటుంబ సభ్యులు లబ్ది పొందారు. వీటితో పాటు అదనపు సభ్యులను చేర్చాలంటూ 1.02 లక్షల మంది కార్డుదారులు దరఖాస్తు చేసుకున్నారు. ఏళ్లకేళ్లుగా పెండింగ్లో ఉన్న ఈ సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కరించింది. ఇప్పటికే ఉన్న కార్డుల్లో అదనంగా 1,03,674 మంది కుటుంబ సభ్యులను నమోదు చేసింది. వచ్చే నెల నుంచి వీరికి రేషన్ పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేయనుంది. గూడు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్ల పథకంలో తొలి రోజునే అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లను ప్రభుత్వం మంజూరు చేసింది. మొత్తం 72 వేల మంది పేదలకు ఇళ్ల పత్రాలను అందించింది.

## సీఎం రేవంత్‌పై కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి
# సంచలన వ్యాఖ్యలు

**రైతుబంధును ఎగ్గొట్టాడని రైతుల శాపనాలు**

**రేవంత్ కంటే కేసీఆర్ పాలనే బాగుంది**

**వైరల్ అవుతున్న రాజగోపాల్‌రెడ్డి వీడియో**

**మునుగోడు,జనవరి27:** కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తమ ప్రభుత్వంపై అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై సంచలన వ్యాఖ్యలు చేశారు. రైతు బంధును ఎగ్గొట్టామని, రైతు భరోసాలో ఇచ్చిన హామీ మేరకు కాకుండా కొంత నగదు తగ్గించామని, గ్రామాల్లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తిట్టుకుంటున్నారని రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న నాలుగు పథకాలు (ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, కొత్త రేషన్ కార్డులు) ప్రారంభోత్సవంలో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం మసీదుగూడెంలో ఏర్పాటు చేసిన సభలో పాల్గొని లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ 'తమకు రైతు రుణమాఫీ కాలేదని, రైతుబంధు రాలేదని గ్రామాల్లోని ప్రజలు ప్రభుత్వాన్ని తిరుడున్నారు. అంతా కేసీఆర్ పాలనే బాగుండేదని మెచ్చుకుంటున్నారు' అని అన్నారు. 'రైతుబంధును మధ్యలో ఒకసారి ఎగ్గొట్టినం. రైతు భరోసాలో ఇచ్చిన హామీ మేరకు కాకుండా, కొంత నగదును తగ్గించినం. అందుకే గ్రామ ప్రజలు ప్రభుత్వాన్ని తిడుతున్నారు. అదే రూ.2 లక్షల రుణ మాఫీ అయినోల్లు మాత్రం జేబులో వేసుకొని సప్పుడు చేస్తలేరు. ఎన్ని అప్పులు చేసైనా



పథకాలు అమలు చేస్తాం' అని అన్నారు. ఇందుకు సంబంధించిన ఓ ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సొంత పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపైనే రాజగోపాల్‌రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేయడంతో.. ప్రతిపక్షాలు ఆ వ్యాఖ్యలను ఆయుధంగా చేసుకుంటున్నాయి. సంక్షేమ పథకాల అమలులో కాంగ్రెస్? ప్రభుత్వం పూర్తిగా ఫెయిలైందని, ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని పేర్కొంటున్నారు. ఏ ఒక్క హామీ కూడా పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని మండిపడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు కూల్చేస్తారని బీఆర్ఎస్, బీజేపీ నేతలు పేర్కొంటున్నారు.

## చిరుమళ్ళ పుట్టు గద్దె సమ్మక్క సారక్క మహాజాతరకు,"

# కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాలు సహాయం చెయ్యాలి : జాతర కమిటీ

- మంత్రి సీతక్క కు జాతర సమాచారం, ఆర్థిక సహాయం కోరిన మాజీ ఎమ్మెల్యే చందా లింగయ్య, చందా వీరయ్య. చుంచు రామకృష్ణ జాతర కమిటీ
- జాతరకు తమ వంతు సహాయం అందిస్తానన్న మహా రాష్ట్ర గవెర్నర్ సి హెచ్ విద్యా సాగర్ రావు
- ఆదివాసి సంస్కృతిని కాపాడాలి అని, జాతరకు ఆహ్వాన పత్రాన్ని అందించిన జాతర కమిటీ,ఆధార్ సొసైటీ సభ్యులు,స్పందించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

**మాఘమాసంలో చిరుమల్ల పుట్టు గద్దెల వద్ద రెండేళ్లకో మారు నిర్వహిస్తున్న సమ్మక్క సారలమ్మ జాతరలో , సమ్మక్క పగిడిద్దరాజుల కళ్యాణం, ఇంటివేల్పుల సమ్మేళనం చందా వంశస్థుల ఆధ్వర్యంలో, ఆదివాసీ తెగల సమన్వయకర్త, కోయ పున్నెం ధర్మ ప్రచారక్ చుంచు రామకృష్ణ, తలపతుల సమన్వయంతో ఫిబ్రవరి 2023 లో విజయవంతంగా నిర్వహించడం జరిగింది. మళ్లీ ఈ సంవత్సరం 11 ఫిబ్రవరి నుండి 15 ఫిబ్రవరి వరకు నిర్వహించడానికి జాతర నిర్వహణ కమిటీ సన్నాహాలు మొదలు పెట్టింది. జనవరి 26న దీక్షలు ప్రారంభం చేశారు అనంతరం సోమవారం కేంద్రం మంత్రి కిషన్ రెడ్డి కి ఆహ్వాన పత్రం అందించే క్రమంలో హైదరాబాద్ వెళ్లారు.. ఆదివాసి ఇది తెగల సమన్వయకర్త చించు రామకృష్ణ వివరాలను అనుసరిస్తూ...**



**తొలి సమయం భద్రాద్రి కొత్తగూడెం ప్రత్యేక ప్రతినిధి జనవరి27:** ఇప్పటికే ఆదివాసీ ఆడబిడ్డ రాష్ట్ర మంత్రివర్యులు శ్రీమతి దనసరి అనసూయ( సీతక్క) గారి దృష్టికి చిరుమళ్ళ చారిత్రిక నేపథ్యాన్ని చందా వంశస్థులు చందా వీరయ్య గ చందా లింగయ్య మాజీ ఎంఎల్ఏ గ చందా భిక్షపతి చుంచు రామకృష్ణ తో కలిసి ఈ జాతర విజయవంతం చేయడానికి కావలసిన ప్రభుత్వ ఆర్థిక సహకారాన్ని అందించాలని వినతి పత్రం అందించారు. దానిలో భాగంగా సోమవారం క్షేత్రం చారిత్రిక నేపథ్యాన్ని కేంద్ర ప్రభుత్వం కూడా గుర్తించాలని కేంద్ర మంత్రి శ్రీ కిషన్ రెడ్డి గారిని కలసి జాతర ఆహ్వాన పత్రికలు చందా వీరయ్య అందజేశారు , కళ్యాణానికి వచ్చే ఇంటి వేల్పు పడగ (డాలు) గుడ్డల విశేషాలు తుమ్మల చెరువు తాటి వెంకటేశ్వర్లు వివరించారు కనుమరుగైపోతున్న కోయతూర్ వేల్పుల సంస్కృతిని పునరుద్ధరించడానికి, సమ్మక్క పగిడిద్దరాజు ల కళ్యాణానికి కావలసిన ఆర్థిక సహకారాన్ని అందించాలని కోరారు తక్షణమే స్పందిస్తూ ఈ విషయాన్ని రాష్ట్ర చీఫ్ సెక్రటరీ పంపించడం జరుగుతుందని, జాతరకు కూడా ఈ సారి కచ్చితంగా హాజరు అవుతానని కలిసిన కమిటీ సభ్యులకు ఆయన చెప్పారు అదేవిధంగా ఆదివాసీల పై ప్రత్యేక అభిమానం చూపించే మహారాష్ట్ర మాజీ గవర్నర్ సీ హెచ్ విద్యాసాగర్ రావునూ కలిసారు చరిత్ర కలిగిన చిరుమళ్ళ క్షేత్రాన్ని అభివృద్ధి చేయడానికి మీ వంతు సహకారం అందించాలని కోరారు తల్లి కళ్యాణానికి హాజరు కావాలని ఆదివాసీ తెగల సమన్వయకర్త చుంచు రామకృష్ణ గారు కోరడంతో, నా వంతు సహకారం తప్పకుండా ఈ జాతరకు అందించడంతో పాటు , జాతరకు 13 వ తారీఖున వస్తానని హామీ ఇచ్చారు. ఈ రోజు జరిగిన హైదరాబాద్ పర్యటనలో చుంచు రామకృష్ణ కోయ పున్నెం ధర్మ ప్రచారక్ తో పాటు,ఆధార్ సొసైటీ గొంది వెంకటరమణ, పోడియం బాలరాజు చిరుమళ్ళ చందా వీరయ్య తాటి వెంకటేశ్వర్లు ఈక సులోచన, ఇర్ప వెంకటేశ్వర్లు , కుర్సం నాగేశ్వరరావు, చాప ముత్తయ్య గన్నెబోయిన చింపిరయ్య , ఇర్ప నరసింహ, కుర్సం సంపత్ తదితరులు పాల్గొన్నారు.



## చిరుమళ్ళ సమ్మక్క, సారక్కల మహిమాన్విత

# జలకం బావి, ఇప్పచెట్టు





**తొలి సమయం, ప్రత్యేక ప్రతినిధి భద్రాద్రి కొత్త గూడెం:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మండలం కరక గూడెం చిరుమళ్ళ గ్రామంలో సుమారు వందల సంవత్సరాల నాటి సమ్మక్క సారక్కకు సంబందించిన ఆనాటి చారిత్రక ఆనవాళ్లుగా జలకం బావి,ఇప్పచెట్టు నేటికీ ఇక్కడ కనిపిస్తు న్నాయి. ఇటువంటి పవిత్ర క్షేత్రంలో చందా వంశస్థుల ఆధ్వర్యంలో 5 వ సారి నేడే సమ్మక్క తల్లి 21 రోజుల దీక్షలు ప్రారంభమైనాయి. ఇక్కడ వున్న జలకం బావిని అంతకు ముందు కోనేరు గా పిలిచేవారు అని గ్రామస్తులు చెబుతుంటారు. అయితే అధి లోతైన మడుగు రూపం లో ఉండేది అని, మూడు కాలాలు నీళ్లు నిక్షేపంగా ఉంటాయి అని ఇక్కడి పెద్దలు చెప్పటం విశేషం. ఈ బావి నీళ్లు కొబ్బరి కాయ నీళ్ల లాగా ఏమాత్రం రంగు మారకు ండా ఉంటాయి. నీళ్లతో స్నానం ఆచరించిన ప్రతి వారు శరీర బరువు తగ్గి తేలిపోయిన అనుభూతి పొందుతారు శరీరం నుండి ఏదో చీడ పీడల జాడ్యాన్ని వదులుకున్న బావన కలుగుతోంది అని దీక్షలు వేస్తున్న సమ్మక్క బాలలు చెప్పుతున్నారు. ఒక నాడు నీటి మడుగుగా ఉన్న ఆ బావిని చందా వంశీయులు, కోయ తెగ వారు బండ రాళ్ల తో ఓడలు పేర్చారు. 100 సంవత్సరాల నుండి అంచుగా కట్టిన బండలు ఏమాత్రం స్థానభ్రంశం కాకుండా నిత్య నూతనంగా దర్శనం ఇస్తున్నాయి.సుమారు 100సంవత్సరాల కాలంలో ఆ ఊరిలో కట్టిన బావులు కూడా ఇంత పటుత్వంగా లేవని గ్రామ స్తులు చెబుతున్నారు. ఈ భావి లోతు 5,6 కండాలు మాత్రమే ఉంటుంది. మండుటెండల్లో బావిలో నీరు ఎండిపోకుండా చెలిమె నీరును పోలి ఉంటా యి. సమ్మక్క సారక్క ల మహా జాతర జాతర దీక్షలు ప్రారంభం సందర్భంగా ముందుగా ఆదివాసీ 9తెగల సమన్వయ కర్త చుంచు రామకృష్ణ మరో 8మంది అనగా 9మందితో మాలాధారణ ముందు జలకం బావి నీటితో అభ్యంగన స్నానం ఆచరించారు. జై సమ్మక్క తల్లి సారలమ్మ తల్లుల నామస్మరణతో జలకం ఆచరించిన విధానం ధార్మిక వాతావరణంగా రూపు సంతరించుకున్నది.ఆదివాసీ మంత్రోచ్చారణ, అత్యంత ఆదివాసీ సంప్రదాయ ఆచారాలతో నేడు 21రోజుల దీక్షలు ప్రారంభం అయ్యాయి.

**ఇప్పచెట్టు:**

వందల ఏళ్ల నాటి ఇప్పచెట్టు ఒక మహావృక్షంగా విలసిల్లుతోంది, మదిలో కోరికలతోతల్లులకు మొక్కులు మొక్కుకొని ఇప్పచెట్టుకు ముడుపులు కట్టుకోని మరుసటి నీ జాతరకు వస్తామని ఒప్పుకున్న వారికి తప్పకుండ కోర్కెలు తీరుతున్నాయి. నిష్టాగరిష్ట లకు మాత్రమే తల్లి దీవెనలు అందుతున్నాయి పొందుతున్నారు అని ఇక్కడి వడ్డేలు ( కోయ పూజారులు), దేవర బాలలు చెప్పడం విశేషం. ఇక్కడ వున్న జలకం బావి ,ఇప్పచెట్లు రెండు కూడా మహిమాన్వితమే , మనసా వాచా కర్మణా నమ్ముకొని ఇక్కడి ఆదివాసీ ఒడ్డెలు( పూజారుల), దేవరబాలల సలహాలు సూచనల మేరకు జాగ్రత్తగా తల్లులను దర్శించుకున్నవారికి ఆ తల్లుల కొండంత అండ ఉంటుంది అని ప్రతీతి. పూర్తి కోయత్తూర్ సంప్రదాయాలతో జరగుతున్న జాతర, సమ్మక్క పగిడిద్దరాజు ల కళ్యాణం, ఇంటి వేల్పుల సమ్మేళనంతో ప్రతి సంవత్సరం భక్తులు చిరుమళ్ళ వైపు దృష్టి సారిస్తుండటంతో ఇప్పటికైనా రాష్ట్ర కేంద్ర పాలకులు ఈ క్షేత్రం పై దృష్టి సారించి తగిన ఏర్పాట్లు, నిర్వహణ కమిటీకి తగిన ఆర్థిక సహకారం అందించాలని చిరుమళ్ళ జాతర నిర్వహణ కమిటీ సభ్యులు, తెగల సమన్వయ కర్త చుంచు రామకృష్ణ గారు అభ్యర్థించారు.





## కౌన్సిలర్లను సన్మానించిన మాజీ ఎమ్మెల్యే చల్లా



**తొలి సమయం హనుమకొండ జనవరి 27:** పరకాల మున్సిపాలిటీ కౌన్సిలర్ల పదవీకాలం శనివారంతో ముగియగా ఈరోజు హనుమకొండలోని వారి నివాసంలో బిఆర్ఎస్ పార్టీ కౌన్సిల ర్లను,కో అప్షన్లను పరకాల మాజీ శాసనసభ్యులు చల్లా ధర్మారెడ్డి శాలువాతో సన్మానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రజలు మీపై నమ్మకంతో గెలిపించినందుకు వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా నిస్వార్థంగా,పారదర్శకంగా ఐదేళ్లు సేవలందించిన కౌన్సిలర్లను అభినందించారు.పదవి ఉన్న లేకున్నా ప్రజాక్షేత్రంలో ఉంటూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని సూచించారు.పరకాల పట్టణంలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరు సమన్వయంతో పనిచేయాలని కోరారు.కాంగ్రేస్ ప్రభుత్వం వైఫల్యాలను,మోసాలను ప్రజలకు తెలియచేయాలన్నారు.ఎన్నికలు ఎప్పుడు వచ్చిన ఎదుర్కొనడానికి సిద్ధంగా ఉండాలని,మరోసారి పరకాల మున్సిపాల్టీపై గులాబీ జెండా ఎగరవేయాలన్నారు.ఈ కార్యక్రమాలో వైస్ చైర్మన్,కౌన్సిలర్లు,కో ఆప్షన్లు తదితరులు పాల్గొన్నారు.

## ఎవరికైనా మరణం తప్పదు

### నివాళులు అర్పించిన చల్లా ధర్మారెడ్డి



**తొలి సమయం పరకాల జనవరి 27** పరకాల మున్సిపల్ వైస్ చైర్మన్,బిఆర్ఎస్ సీనియర్ నాయకులు రేగూరి విజయపాల్ రెడ్డి తండ్రి రేగూరి వెంకట్ రెడ్డి ఈరోజు ఉదయం మరణించగా విషయం తెలిసిన పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పరకాలలోని వెంకట్ రెడ్డి నివాసానికి చేరుకొని ఆయన భౌతికకాయాన్ని సందర్శించి పూలమాల వేసి పూలమాలవేసి నివాళులర్పించి అంతిమయాత్రలో పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే చల్ల ధర్మారెడ్డి వెంట పరామర్శించిన వారిలో నియోజకవర్గంలోని బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు తదితరులు ఉన్నారు.

### బిజెపి రాష్ట్ర నాయకులు డాక్టర్ పెసరు విజయ్ చందర్ రెడ్డిచే

## తొలిసమయం క్యాలెండర్ ఆవిష్కరణ



**తొలి సమయం హనుమకొండ జనవరి 27:** తొలి సమయం దినపత్రిక 2025 క్యాలెండర్ ను సోమవారం బిజెపి రాష్ట్ర నాయకులు, రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ విజయ చందర్ రెడ్డి ఆవిష్కరించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో నాలుగు స్తంభంగా ఉన్న మీడియా ప్రజలకు ప్రభుత్వాలకు వారిదిగా ఉంటూ ప్రజలకు అందుబాటులో ఉంటూ తొలి సమయం దినపత్రిక రోజురోజుకు అభివృద్ధి చెందాలని ఆయన కోరారు... ఈ కార్యక్రమంలో ప్రతినిధి పొన్నగంటి స్వామి, రాజు, వంశి, సుమంత్, తదితరులు పాల్గొన్నారు.

## సంకల్పం బలానికి కృషి తోడైతే విజయం సాధ్యం

### వికాస్ విద్యా సంస్థ ల కరెస్పాండెంట్ బిక్కి వెంకటేశ్వర్లు



**తొలి సమయం మహబూబాబాద్ జనవరి27:** తొలి సమయం నూతన క్యాలెండర్ ను వికాస్ విద్యాసంస్థల కరస్పాండెంట్ బిక్కి వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ సంకల్ప బలానికి కృషి తోడైతే విజయం సాధ్యం అన్నారు ఈ కార్యక్రమం లో రాజ్యాంగ సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు రాజేందర్ గౌడ్, జేరిపోతుల వెంకన్న గౌడ్ పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగ చిరుమళ్ల లో
# సమ్మక్క సారక్క దీక్షలు ప్రారంభం





**తొలి సమయం భద్రాద్రి కొత్త గూడెం జనవరి 27:**
బ్రహ్మ ముహూర్తాన చిరుమళ్ళ పుట్టు గద్దెల ప్రాంగణం ముస్తాబుకు సిద్ధం అయ్యింది. దూప దీప నైవేద్యాలతో అత్యంత దార్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. పుట్టు గద్దెల పరిసరాల్లో అంతు చిక్కని పరిమళం నలు దిక్కులకు పరివ్యాప్తం అయ్యింది చందావంశ మహిళలు చిరుమళ్ళ సమ్మక్క సారక్క ల పుట్టు గద్దెలు, ప్రాంగణం, మరియు తరాల నాటి ఇప్పచెట్టు, జలకం బావి చుట్టూ పరిసరాలను శుభ్రం చేశారు, ముత్యాల ముగ్గులతో గుడిని అలంకరించారు. ప్రధాన ద్వారాలు గుమ్మాలను ముగ్గులతో తీర్చి దిద్దారు. 21 రోజుల సమ్మక్క దీక్షలకు చిరుమళ్ళకు చేరుకున్న పర్సిక వంశాన్ని (పగిడిద్ద రాజు వంశం) సమ్మక్క సారక్క ల వంశీయులైన చందా వారు ఆహ్వానించారు. వారు వెంకటాపురం మండలం లోని ఎదిర నుండి బయలు దేరి చిరుమళ్ల వద్ద వున్న పుట్టు గద్దెలకు చేరుకున్నారు. రెండు వంశాలు అలాయ్ బలయ్ తో అలింగనాలు చేసుకున్నారు.. మొదటి విడతగా జలకం బావి నీటితో ఆదివాసి 9 తెగల సమన్వయకర్తతో పాటు 8 మంది ఆదివాసీలు అభ్యంగన స్నానం ఆచరించారు. పసుపు రంగు ఖాదీ వస్త్రాలు ఎరుపు కందువా ( ఆకుపచ్చ అంచు) ధరించారు. సమ్మక్క సారక్క గుడిలో ఆదివాసీ పూజా విధానంతో చందా వీరయ్య గారు గుడిలో పూజలు చేశారు.

**సమ్మక్క ఉపవాస దీక్షా విధానికి**

కావలసిన పసుపు కుంకుమ బంగారం (బెల్లం )పూలు ఇప్పపువ్వు కొబ్బరి కాయ, మాలలు మూడు రకాలు అవి రుద్రాక్ష ,తులసి ,తామర. ఇరవై ఒక్క దీపం వత్తులు, పెద్ద ప్రమిద ఆవు నెయ్యి ,విప్పనూనె లను ఉపయోగించారు నవధాన్యాలు పోసి సమ్మక్క సారక్క గద్దెల ఫోటోలతో పాటు సృష్టి లయకర్త పెర్సపేన్( పరమేశ్వరుడు) , ఆదివాసి ధర్మ గురు పహండి పారి కుపార్ లింగో ఫోటో ప్రతిష్టించారు. ఈ రోజుతో ప్రారంభం అయిన దీక్షలు 21 రోజుల వరకు నిరవదికంగా సమ్మక్క బాలలు ( దీక్ష ధరించిన వారు) అత్యంత నిష్టా గరిష్టతో నియమాలను పాటిస్తూ, ఒక్క పూట భోజనంతో అత్యంత నిష్ఠ కల దీక్షలు జాతర అయిన తరువాత రోజు బుర్దారం జ్వాలా లక్ష్మీ నరసింహస్వామి దర్శనంతో పూర్తి చేసుకుని సమ్మక్క తల్లి కరుణా కరుణాకటాక్షాలను పొందుతున్నారు.





# స్పష్టత లేని కాంగ్రేస్ పాలనపై
# ప్రజా తిరుగు బాటు తప్పదు

**వాయిదాల ముఖ్యమంత్రి పూటకోమాటతో ప్రజలను మోసం**

**ప్రభుత్వ తీరుతో ప్రజాగ్రహం..ఒత్తిడిలో అధికారులు**

**రాజ్యాంగం అమలులోకి వచ్చిన రోజు ఝూటా చేసి జనవరి26 ను అవమానించిన కాంగ్రేస్ ప్రభుత్వం**

**బీఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే పెద్దిసుదర్శన్ రెడ్డి**

**తొలి సమయం నర్సంపేట జనవరి 27:**
సంక్షేమ పథకాల అమలుపై మాట మార్చిన రేవంత్ సర్కార్ను ప్రజలు నిలదీయాలి అని మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి అన్నారు. వంద రోజుల్లో అన్ని హామీలు అమలు చేస్తామని చెప్పి 400 రోజులు దాటిన ఇప్పటికీ సంక్షేమ పథకాల అమలుపైన ప్రజలకు స్పష్టత ఇవ్వని కాంగ్రెస్ ది అసమర్థ సర్కారు అన్నారు కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలుపైన తీసుకుంటున్న అస్పష్టమైన విధానాలతో అధికారులు తీవ్ర మానసిక వేదనకు గురి అవుతున్నారు అన్నారు లి ప్రజలలో ఉద్యోగుల పట్ల గౌరవం తగ్గిపోతుంది అన్నారు. కేవలం ఒక్క శాతం ప్రజలకు మాత్రమే సంక్షేమ పథకాలు ప్రారంభించి 99% మంది తెలంగాణ ప్రజలను నిరాశపరిచిన రేవంత్ సర్కార్ కు ప్రజలు బుద్ధి చెప్పాలి అన్నారు. మండలానికి ఒక చిన్న గ్రామాన్ని ఎంచుకుని అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇదే పద్ధతిలో రాష్ట్రం లోని అన్ని గ్రామాలలో అర్హులైనా ప్రతి ఒక్కరికీ అందించాలి అన్నారు. మీరు ప్రారంభించిన పథకాల అమలు పట్ల ప్రజల్లో విశ్వాసం లేదు.అన్నారు. జనవరి 26 నుండి 4 పథకాలు తెలంగాణ ప్రజలందరికీ అందిస్తామని చెప్పి నేడు మాట మార్చింది అన్నారు . ఫిబ్రవరి మొదటి వారం నుండి మార్చి 31 వరకు అమలు చేస్తామని చెప్పడంలో తెలంగాణ ప్రజలను మోసం చేసే కుట్ర చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం అన్నారు. గ్రామ సభలలో లబ్ధిదారులను తేల్చి అందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని చెప్పి గ్రామసభలు పూర్తి చేసుకున్న తర్వాత ఒక శాతం ప్రజలకు మాత్రమే సంక్షేమ పథకాలు ఇస్తామని చెప్పడం ప్రజలను మోసం చేయడమే...అన్నారు రేవంత్ సర్కార్ ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు ఒక్క సంక్షేమ పథకాన్ని కూడా సంపూర్ణంగా అమలు చేయలేదు అన్నారు. ముఖ్యంగా రైతులకు రుణమాఫీ 30 శాతం మాత్రమే చేసింది బోనస్



10% కన్నా ఎక్కువ చెల్లించలేదు అన్నారు రైతు భరోసాపై మాట తప్పింది అన్నారు రైతులు పండించిన పంటకు మద్దతు ధర చెల్లిస్తానని రైతులను మోసం చేసింది..అన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసాతో రైతు కూలీలను దగా చేసింది అన్నారు కౌలు రైతులకు రైతు భరోసాలో స్థానం లేకుండా చేసింది..అన్నారు. గ్రామ సభలలో ప్రజలు చూపించిన నిరసన ప్రారంభం మాత్రమే భవిష్యత్తులో సంక్షేమ పథకాలు అన్ని గ్రామాలలో అమలు చేయకపోతే గెలిచిన ఎమ్మెల్యేలు గ్రామాలలో తిరగలేరు అన్నారు లి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలం పూర్తి అయిన ఒక్క శాతం సంక్షేమ పథకాలను కూడా అమలు చేయలేదు అన్నారు ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదు అన్నారు. మహిళలు, రైతులు నిరుద్యోగులు యువకులు, ఉద్యోగులు ఈ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకతను చూపిస్తున్నారు అన్నారు. సంక్షేమ పథకాలను అన్ని గ్రామాల్లో అన్ని వర్గాల ప్రజలకు అందించాలి లేనిచో ప్రభుత్వం భవిష్యత్తులో తీవ్ర నిరసనను ఎదుర్కోబోతోంది..అని హెచ్చరిక చేశారు.

## రాజా రామ్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు

**పాల్గొన్న ఎమ్మెల్యే యశస్విని ఝాన్సీ రెడ్డి**

**తొర్రూరు తొలి సమయం జనవరి 27 :** పాలకుర్తి నియోజకవర్గం ఇంచార్జ్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి కుమారుడు ఎమ్మెల్యే యశస్విని జాన్సీ రెడ్డి భర్త రాజా రామ్మోహన్ రెడ్డి వేడుకలు అట్టహాసంగా జరిపారు.రాయపర్తి మండల కేంద్రంలో పార్టీ శ్రేణుల మధ్యన జన్మదిన వేడుకలను ఏర్పాటు చేశారు ఇట్టి కార్యక్రమంలో పార్టీ శ్రేణులు అభిమానులు పాల్గొన్నారు జన్మదిన పురస్కరించుకొని రాయపర్తి పోలీస్ స్టేషన్ కు లక్ష రూపాయలు విరాళా అందజేశారు విరాళాన్ని మహిళల సంరక్షణ కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడానికి వాడాలని సూచించారు మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామాన్ని



పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి ప్రతి ఇంటికి ఒక సోలార్ పాలను ఏర్పాటు చేసి మోడల్ గ్రామంగా తీర్చిదిద్దుతామని తెలిపారు ఈ యొక్క కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ హనుమాన్ల తిరుపతిరెడ్డి రవీందర్ రెడ్డి కృష్ణా రెడ్డి నాయకులు ప్రజలు ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

# తొలి సమయం మానుకోట పత్రిక

**- సహకరించడం మానుకోట బాధ్యత**

**- డీసీసీ అధ్యక్షులు జె,భారత్ చందర్ రెడ్డి**



**తొలి సమయం మహబూబాబాద్ జనవరి 27:**
తొలి సమయం నూతన క్యాలెండర్ ను డీసీసీ అధ్యక్షులు జె.భరత్ చందర్ రెడ్డి ఆవిష్కరణ చేశారు ఈ సందర్భంగా మాట్లాడుతూ తొలి సమయం దినపత్రిక మానుకోట ప్రాంతానికి చెందింది. కనుక పత్రికకు చేయూత నివ్వడం మనందరిబాధ్యత అన్నారు.ఈ కార్యక్రమంలో పలు వురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## కిడ్నీ రాకెట్ కేసులో కీలక విషయాలు

**ఇప్పటి వరకు 9మందిని అరెస్టు చేసిన పోలీసులు**

**హైదరాబాద్,జనవరి27:** తెలంగాణ వ్యాప్తంగా సంచలనం రేపిన కిడ్నీ రాకెట్ కేసులో కీలక విషయాలు బయటపడ్డాయి. ఎల్బీనగర్ వేదికగా అలకనంద హాస్పిటల్‌లో గుట్టుగా సాగుతున్న కిడ్నీ మార్పిడి రాకెట్ గుట్టు తేల్చారు పోలీసులు. ఈ కేసులో ఇప్పటివరకు 9 మందిని రాచకొండ పోలీసులు అరెస్టు చేశారు. అరెస్ట్ అయిన వారిలో చాలామంది డాక్టర్లు కూడా ఉన్నారు. విదేశాల్లో ఎంబీబీఎస్ పూర్తి చేసి ఇక్కడ ఎలాంటి ఇన్కమ్ లేకపోవడంతో కిడ్నీ ట్రాన్స్ ప్లాంటేషన్ చేసి డబ్బులు సంపాదించాలని ప్లాన్ చేశారు. ఇందులో భాగంగా డాక్టర్ అవినాష్, డాక్టర్ సుమంత్ ఇద్దరూ కలిసి భారీగా కిడ్నీ ట్రాన్స్ ప్లాంటేషన్ ఆపరేషన్లు చేశారు. మొదట డా. అవినాష్ సైదాబాద్‌లో జననీ హాస్పిటల్‌ను స్థాపించాడు. అందులో ఆయనకి ఆశించినంత సక్సెస్ రాకపోవడంతో 2022లో హాస్పిటల్ మూసేశాడు. తర్వాత డాక్టర్ సుమంత్ పరిచయం కావడంతో ఇద్దరు కలిసి సరూర్‌నగర్‌లో అలకనంద హాస్పిటల్ స్థాపించారు. ఈ హాస్పిటల్‌లో గుట్టు చప్పుడు కాకుండా కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు నిర్వహించేవారు. ఆరు నెలల వ్యవధిలో సుమారు 20కి పైగా కిడ్నీ ఆపరేషన్లు నిర్వహించారు. ఆపరేషన్ల నిర్వహణ కోసం ఇతర రాష్ట్రాల నుంచి సర్జరీ నిర్వహించే డాక్టర్లను అలకనంద హాస్పిటల్‌కు రప్పించారు.. సర్జరీ చేసే వైద్యుల్లో కీలకంగా తమిళనాడుకు చెందిన డాక్టర్ రాజశేఖర్‌తో పాటు జమ్ము కాశ్మీర్‌కు చెందిన డాక్టర్ సాహెబ్ ఉన్నారు. కిడ్నీలను డొనేట్ చేసేందుకు ఎక్కువగా పేద కుటుంబానికి చెందిన వారే ఆసక్తి చూపిస్తున్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా కిడ్నీ అమ్మితే లక్షల రూపాయలు వస్తాయని ఆశపడి ఎలాంటి నిబంధనలు లేకున్నా సరే ఈ తరహాలో ప్లాన్ చేస్తున్నారు. ఒక్కో కిడ్నీ ఆపరేషన్‌కు దళారులు 60 లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారు. వీటిలో కిడ్నీ డొనేట్ చేస్తున్న వ్యక్తికి కేవలం 5 లక్షల రూపాయలు మాత్రమే ఇస్తున్నారు. కిడ్నీ ఆపరేషన్ చేసిన వైద్యుడికి ఒక్కో డాక్టర్‌కు 10 లక్షల రూపాయల చొప్పున ఇస్తున్నారు. మధ్యవర్తులు, ఏజెంట్లకి ఒక్కో ఆపరేషన్‌కు 30 వేల రూపాయలు ఇస్తున్నారు. ఇప్పటికే ఈ కేసులో 9 మందిని రాచకొండ పోలీసులు అరెస్టు చేశారు. మొత్తం 15 మంది నిందితులను పోలీసులు గుర్తించారు. వీరిలో మరో ఆరుగురు ప్రస్తుతం పరారీలో ఉన్నారు. మెయిన్ సర్జరీ చేసిన ఇతర డాక్టర్ల కోసం రాచకొండ పోలీసులు గాలిస్తున్నారు. వీరిని పట్టుకునేందుకు చెన్నైతోపాటు జమ్ము కాశ్మీర్ కు ఎస్ఓటి బృందాలు వెళ్లినట్టు సమాచారం.

## సూర్యాపేటలో మరో పరువు హత్య

**సూర్యాపేట,జనవరి27:** సూర్యాపేటలోని మామిల్లగడ్డకు చెందిన వడ్లకొండ కృష్ణ అలియాస్ మాల బంటి హత్యకు హత్యకు గురయ్యాడు. పిల్లలమర్రి సమీపంలోని మూసీ కాలవ కట్టపై మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పిల్లల మర్రికి చెందిన నవీన్, కృష్ణ స్నేహితులు. తరచూ పిల్లలమర్రిలోని నవీన్ ఇంటికి వస్తూ పోతున్న కృష్ణ నవీన్ సోదరి భార్గవిని ప్రేమించాడు. వీరి ప్రేమను భార్గవి తల్లిదండ్రులు అంగీకరించలేదు. దీంతో ఆరు నెలల క్రితం భార్గవిని కృష్ణ కులాంతర ప్రేమ వివాహం చేసుకున్నాడు. భార్గవి, కృష్ణ ఇద్దరూ సూర్యాపేటలో కాపురం పెట్టాడు. ప్రేమ పెళ్లిని నిరాకరించిన భార్గవి తల్లిదండ్రులు వారిని విడదీసేందుకు తీవ్ర ప్రయత్నాలు చేశారు. కులాంతర వివాహం చేసుకున్న బంటిపై భార్గవి సోదరుడు నవీన్ కక్ష పెంచుకున్నాడు. ఆదివారం సాయంత్రం 5 గంటల సమయంలో మహేష్ అనే మిత్రుడి నుంచి ఫోన్ కాల్ అందుకున్న కృష్ణ భార్యకు ఫోన్ ఇచ్చి బయటకు వెళ్లాడు. రాత్రి లేట్ అయినా కృష్ణ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. సూర్యాపేట జనగాం క్రాస్ రోడ్ నుండి పిల్లల మర్రికి వెళ్లే మూసి కెనాల్ కట్టపై కృష్ణ మృతదేహం పడి ఉంది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో కృష్ణ బంధువులు పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. దుండగులు మృతుడి మెడకు ఉరి వేసి చంపినట్లు గుర్తులు కన్పిస్తున్నాయి. మృతుడి ఒంటిపై కమిలిన గాయాలున్నాయి. నిందితులను గుర్తించేందుకు పోలీసులు గాలిస్తున్నారు. భార్గవి సోదరుడు కోట్ల నవీన్ హత్యకు పాల్పడ్డట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. మృతుడు కృష్ణ పలు కేసుల్లో నిందితుడుగా ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు. అయితే ఈ హత్యకు ప్రేమ వివాహమే కారణమా, లేక పాత కక్షలే కారణమా అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## చైతన్య విద్యాసంస్థలకు భారీ షాక్

**హైదరాబాద్,జనవరి27:** మాదాపూర్‌లోని శ్రీచైతన్య విద్యాసంస్థల సెంట్రల్ కిచెన్ లైసెన్స్‌ను ఆహార భద్రతా విభాగం అధికారులు రద్దు చేశారు. గత శుక్రవారం శ్రీచైతన్య కిచెన్‌ను ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. వేల మందికి భోజనం తయారు చేస్తున్న వంటగదిలో పాడైపోయిన ఆహార పదార్థాలు ఉన్నట్లు గుర్తించారు. సుమారు 125 కిలోల గడువు తీరిన ఆహార పదార్థాలను అధికారులు సీజ్ చేశారు. బియ్యం, కూరగాయలు, పప్పుదినుసులను అపరిశుభ్ర వాతావరణంలో స్టోర్ చేస్తున్నట్టు గుర్తించారు. కిచెన్, స్టోర్ రూమ్‌లో బొద్దింకలు, ఎలుకలు తిరుగుతున్నట్టు తేల్చారు. ఈ వంటగది నుంచే గ్రేటర్ హైదరాబాద్‌లోని చైతన్య కాలేజీల హాస్టళ్లకు ఆహారం సరఫరా చేస్తున్నట్టు అధికారులు గుర్తించారు.

# మీ పథకాలకు మీరు ఏమైనా పేర్లు పెట్టుకోండి..

**కానీ కేంద్ర పథకాల పేర్లు మార్చితే ఊరుకోం**

**కేంద్రం ఇచ్చే పథకాలకు ప్రధాని మోదీ ఫొటో ఎందుకు పెట్టరు**

**ప్రజలను మాయచేస్తున్న రేవంత్‌రెడ్డి : బండిసంజయ్**

**హైదరాబాద్,జనవరి27:** మీ పథకాలకు ఏమైనా పేర్లు పెట్టుకోండి.. కానీ కేంద్ర పథకాలకు పేర్లు మార్చితే ఊరుకోమని కేంద్ర మంత్రి బండిసంజయ్ అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేంద్ర సంక్షేమ పథకాల పేర్లను మార్చితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన, గరీబ్ కళ్యాణ్ యోజన వంటి పథకాలను రాష్ట్ర ప్రభుత్వ ప్రమేయం లేకుండా కేంద్రమే నేరుగా ప్రజలకే అందిస్తుందన్నారు. పరిస్థితి అంత వరకు తీసుకురావొద్దని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు తెలిపారు. సంక్షేమ పథకాల అమలు విషయంలో పేదలకు ఎట్టి పరిస్థితిల్లోనూ తాము అన్యాయం చేయబోమని స్పష్టం చేశారు. ప్రజలందరికీ ఉచితంగా బియ్యం కేంద్రమే ఇస్తోంది కదా... గరీబ్ కళ్యాణ్ యోజన అని పేరు పెడితే తప్పేంది? ప్రధాని ఫోటో ఎందుకు పెట్టరు అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వ నిధులతో ఖర్చయ్యే సంక్షేమ పథకాలకు ఎవరి పేరు పెట్టుకున్నా తమకు అభ్యంతరం లేదని.. కాంగ్రెస్‌కు నచ్చితే ఒసామా బిన్ లాడెన్, దావూద్ ఇబ్రహీం పేర్లు పెట్టుకున్నా అభ్యంతరం లేదంటూ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి అభివృద్ధిపై చిత్తశుద్ధి లేదని విమర్శించారు. అభివృద్ధి విషయంలో కేంద్రం పూర్తిగా సహకరిస్తోందన్నారు. గత 10 ఏళ్లలో రూ.12 లక్షల కోట్లకుపైగా కేంద్రం ఖర్చు చేసిందని తెలిపారు. గ్రామాల్లో జరిగిన అభివృద్ధి అంతా కేంద్ర నిధులతోనే అని స్పష్టం చేశారు. రైతు భరోసా, కమ్యూనిటీ హాల్, స్మశాన వాటిక, వీధి దీపాలు, రోడ్ల పైసలన్నీ కేంద్ర ప్రభుత్వానివే అని చెప్పుకొచ్చారు. ఆరు గ్యారంటీలపై కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేనేలేదన్నారు. "మండలానికి ఒక గ్రామంలోనే నాలుగు పథకాలకు ఎంపిక చేసి లబ్ధి చేయడమేంది? మిగిలిన గ్రామాల ప్రజలు కాంగ్రెస్‌కు ఓట్లేయలేదా? రాష్ట్ర ప్రజలకు ఇంత దుర్మార్గంగా చీటింగ్ చేస్తారా? రాష్ట్ర ప్రజలందరికీ లబ్ధి చేకూరుస్తామని చెప్పి మండలానికి ఒక గ్రామానికి లబ్ధి చేకూర్చడం నీచం. కాంగ్రెస్ నేతల జేబుల నుంచి రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు ఖర్చు చేస్తున్నారా? లేక పాకిస్తాన్..బంగ్లాదేశ్ నుంచి తెచ్చి ఖర్చు చేస్తున్నారా? ప్రజలు కట్టిన పన్నులతోనే కేంద్రమైనా, రాష్ట్రమైనా ఖర్చు చేస్తోంది కదా? గతంలో పీఎం ఆవాస్ యోజన పేరుతో 2 లక్షల 40 వేల ఇండ్లను కేంద్రం మంజూరు చేస్తే... కేసీఆర్ ఒక్క ఇల్లు కట్టకుండా ప్రజలను రోడ్డున పడేసింది నిజం కాదా? డబుల్ బెడ్రూం ఇండ్ల పేరుతో ప్రజలను మభ్యపెట్టి మోసం చేసింది నిజం కాదా?" అంటూ ప్రశ్నలు కురిపించారు. పద్మ అవార్డుల జాబితాను పంపేటప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించి పంపాలని హితవుపలికారు. గద్దర్‌కు ఎట్లా పద్మ అవార్డులిస్తామని ప్రశ్నించారు. ఎంత మంది బీజేపీ కార్యకర్తలను మట్టు పెట్టారో తెలియదా అని అన్నారు. వందల మంది బీజేపీ కార్యకర్తలు నమ్మిన సిద్ధాంతం కోసం ప్రజాస్వామ్యబద్ధంగా ఆందోళన చేస్తే... నక్సలైట్లతో కలిసి హత్య చేయించిన వ్యక్తి గద్దర్ అంటూ వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ సెంటిమెంట్‌తో ఎవరు లాభపడ్డారో... ఎవరు బలైపోయారో ప్రజలందరికీ అర్థమైందని కేంద్రమంత్రి బండి సంజయ్ పేర్కొన్నారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం

**మాజీ ఏఎస్పీ తిరుపతన్నకు బెయిల్ మంజూరు**

**10 నెలలు జైలులో గడిపిన తిరుపతన్న**

**హైదరాబాద్,జనవరి27:** తెలంగాణలో అత్యంత సంచలనం రేపిన ఫోన్‌ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇన్నాళ్లు అరెస్ట్‌లు, దర్యాప్తులు, విచారణల తర్వాత- ఈ కేసులో ఫస్ట్ బెయిల్ వచ్చింది. మాజీ ఏఎస్పీ తిరుపతన్నకు బెయిల్ లభించింది. షరతులతో కూడిన బెయిల్ ను సుప్రీంకోర్టు మంజూరు చేసింది. ట్యాపింగ్ కేసులో 10 నెలలుగా జైల్లో గడిపారు మాజీ పోలీస్ అధికారి తిరుపతన్న బెయిల్ అనంతరం విడుదల కానున్నారు. రాజకీయ నేతల ఆదేశాల మేరకు అందరి ఫోన్లను ట్యాప్ చేశారని, హైకోర్టు జడ్జిల ఫోన్లు కూడా ఇందులో ఉన్నాయని మాజీ ఏఎస్పీ తిరుపతన్నపై ఆరోపణలు ఉన్నాయి. ఆధారాలు చెరిపేయడంలోనూ ఆయనదే కీలక పాత్ర అనే అభియోగాలు కూడా ఉన్నాయి. 2023 డిసెంబర్ 3న ఎన్నికల ఫలితాలు రాగానే ఆధారాలు ధ్వంసం చేసిట్టుగా ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఈ కేసులో అరెస్టైన తిరుపతన్న పది నెలలుగా జైలులో ఉండగా.. తాజాగా ఆయనకు బెయిల్ ఇచ్చింది సుప్రీం కోర్ట్. వాస్తవానికి ఫోన్ ట్యాపింగ్ కేస్ లో అరెస్ట్ అయ్యిన వారిలో మొదటి వ్యక్తి తిరుపతన్న.. ఫోన్ ట్యాపింగ్ కేసులో నలుగురిని గత ఏడాదిలో హైదరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు.. అడిషనల్ ఎస్పీ ప్రణీత్ రావ్, అడిషనల్ ఎస్పీ భుజంగ రావ్, అడిషనల్ ఎస్పీ తిరుపతన్న, మాజీ టాస్క్ ఫోర్స్ డీసీపీ రాధాకిషన్ రావ్ లను పోలీసులు అరెస్ట్ చేసారు. దాదాపు 10 నెలలకు పైగా జైల్ లోనే ఉన్నారు. బయటికి వచ్చేందుకు అనేక సార్లు బెయిల్ పిటిషన్ లు దాఖలు చేసినప్పటికీ రిజెక్ట్ అవుతూ వచ్చాయి. హై కోర్టులో పలుమార్లు బెయిల్ పిటిషన్లు దాఖలు చేసినప్పటికీ ఇక్కడ ఊరట లభించలేదు. తాజాగా సుప్రీం కోర్టును ఆశ్రయించగా అడిషనల్ ఎస్పీ తిరుపతన్నకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది. తిరుపతన్నను గత ఏడాది 24న ఫోన్ ట్యాపింగ్ కేసులో పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో అదే సమయంలో మరో అడిషనల్ ఎస్పీ భుజంగరావు ఉన్న సైతం పోలీసులు అరెస్టు చేశారు. వీరిద్దరూ అనేకసార్లు లోయర్ కోర్టుతో పాటు హైకోర్టులోను బెయిల్ పిటిషన్లు దాఖలు చేశారు. ఇప్పటివరకు ఎవరికీ పూర్తిస్థాయిలో బెయిల్ మంజూరు కాలేదు.

# మావోయిస్టులకు కాలం చెల్లిందా...?

మావోయిస్టులకు వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. ఇటీవలి ఎన్‌కౌంటర్లలో వరుసబెట్టి నేతలు నేలకు ఒరిగారు. కేంద్రం కూడా మావోల అణచివేతకు పకడ్బందీ వ్యూహంతో అడుగులు వేస్తోంది. ప్రజల్లో వారికి స్థానం లేకపోవడం కూడా అణచివేతకు వ్యతిరేకత రావడం లేదు. ఎన్‌కౌంటర్లు జరిగినా పెద్దగా స్పందన రావడం లేదు. ఇకపోతేగతంలో తెలంగాణ, ఎపిల్లో వారి పట్టుబాగా ఉండేది. కానీ ఇప్పుడా పరిస్థితి లేదు. ఈ రెండు రాష్ట్రాల్లో పూర్తిగా తుడిచిపెట్టుకు పోయాయి. కేవలం ఛత్తీస్‌ఘడ్‌లో మా÷-తరమే కొంత ప్రభావం చూపుతున్నారు. అదికూడా అడవులకే పరిమితం కావడం, అడపాదడపా చిన్నాచితకగా కార్యక్రమాలు చేపట్టడం వంటివి చేస్తున్నారు. అడవిచుట్టూ ఉన్న గిరిజనులు కూడా తుపాకులకు భయపడి వారికి సలాం కొడుతున్నారు.

అయితే ఎన్‌కౌంటర్లలో అందరూ నేలకు ఒరిగినా ఒక్క గిరిజనులు లేదా గిరిజన ప్రజలు కన్నీరు కార్చడం లేదు. కారణమేమంటే మావోలు ప్రజలతో సంబంధాలను వదులుకున్నారు. ప్రజలకు దూరంగా ఉంటున్నారు. ప్రజా ఉద్యమాలు ఆగిపయాయి. ప్రజల పక్షాన కొట్లాడడం లేదు. అందుకే మావోయిస్టు పార్టీ చివరి శ్వాస తీసుకుంటున్నది.నక్సలైట్ విముక్త భారత్ కోసం సాయుధ బలగాలు అత్యంత ధైర్యసాహసాలతో వందలాదిమంది మావోయిస్టులను నేల కూల్చారు. చత్తీస్‌గఢ్, ఒడిశా సరిహద్దుల్లోని అడవుల్లో భారీ ఎన్‌కౌంటర్ అనంతరం కేంద్ర హోంమంత్రి అమిత్ షా తక్షణ స్పందన ఇది. మావోయిస్టు లకు ఇక స్థానం లేదని, నక్సలిజం అంతరించిందని అన్నారు. తుపాకీతో రాజ్యం సాధించడం కల్ల అని తేలిపోయింది.








## అట్టహాసంగా జిల్లా ఆవోపా ప్రమాణ స్వీకారోత్సవం

**కరీంనగర్, 27**

స్థానిక కృష్ణా నగర్ లోని ఆవోపా భవనంలో కరీంనగర్ జిల్లా ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ కార్యవర్గ ప్రమాణస్వీకారం ఆదివారం రాత్రి అట్టహాసంగా జరిగింది. తెలంగాణ రాష్ట్ర ఆవోపా ప్రధాన కార్యదర్శి బచ్చు శ్రీధర్, అడ్వైజర్ గంజి స్వరాజ్ బాబు, ఉపాధ్యక్షులు సామా నారాయణ లు ముఖ్య అతిథిలుగా హాజరై జిల్లా ఆవోపా 2025-2027 కాలానికి నూతన కార్యవర్గము చేత ప్రమాణ స్వీకారం చేయించారు. మొదట జిల్లా అధ్యక్షులు కొమురవెల్లి వెంకటేశం, ప్రధాన కార్యదర్శి అయిత ఈశ్వర్ ప్రసాద్, కోశాధికారి కట్కూరు సుధాకర్ లను, ఉపాధ్యక్షులుగా కొండురి శ్రీనివాస్, కొత్త ప్రకాశ్, దశరథం , వి రవీందర్, ఐత సుధాకర్, పబ్బా అరుణ లతోపాటు ఇతర కార్యవర్గ సభ్యులను, అదే విధంగా జిల్లా మహిళా విభాగ్ అధ్యక్షురాలిగా బొడ్ల గీత రాణి, ప్రధాన కార్యదర్శి లక్కాకుల శ్రీదేవి, కోశాధికారి అక్కినపల్లి లతో పాటు ఇతర కార్యవర్గ సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి వైశ్య భవన్ అధ్యక్షులు చిదుర సురేష్ , జిల్లా మహా సభల అధ్యక్షులు కన్న కృష్ణ, హుజురాబాద్, జమ్మికుంట, టౌన్ ఆవోపా ప్రతినిధులు, పట్టణ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

## మావోయిస్టుల నిర్మూలనలో కేంద్రం పైచేయి

**పూర్తిగా తుడిచిపెట్టే లక్ష్యంతా పనిచేస్తున్న బలగాలు**

**ప్రజల్లో ఆదరణ కోల్పోవడంతో మావోలకు తప్పని తిప్పలు**

**న్యూఢిల్లీ,జనవరి27:** దేశంలో అశాంతికి కారణమని చెబుతున్న మావోయిస్టుల అంశాన్ని పరిష్కరించడం అంటే వాళ్ళను నిర్మూలించడమేనని ప్రధాని మోడీ, అమిత్ షా చాలా కాలంగా భావిస్తున్నారు. అందుకే నక్సల్స్ నిర్మూలనకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారు. అడువులను జల్లెడ పట్టిస్తున్నారు. అర్బన్ నక్సలైట్లుగా గుర్తించిన వారిని సైతం అంతమొందిస్తున్నారు. కేసులతో వేధిస్తున్నారు. నక్సల్స్‌కు ప్రజాదరణ లేకుండా చేయడం, వారిని మట్టుపెట్టడం అన్న లక్ష్యంతో కేంద్రం ముందుకు సాగుతోంది. సమస్యఎంతటి తీవ్రమైనదైనా, దాన్ని సరిగా అర్థం చేసుకోకపోతే అది మరింత జటిలం కావచ్చు. సాయుధ దళాలు అడవుల్లోకి బాగా లోపలికి చొచ్చుకుపోగలుగుతున్నవి. ప్రభుత్వ సాయుధ బలగాలకు నక్సలైట్లకు మధ్య దూరం నానాటికీ తగ్గిపోతోంది. మావోయిస్టుల ప్రధాన స్థావరాలకు సమీపంలో బలగాలు చేరిపోతున్నాయి. అందుకు ప్రజల మద్దతు కూడా దక్కుతోంది. కారణమేమంటే ఇన్‌ఫార్మర్ల పేరుతో మావోయస్టులు అమాయక గిరిజనలను అంతమొందిస్తున్నారు. ఇది వారికి మింగుడు పడడం లేదు. ఇంతకాలం దుర్భేద్యమనుకున్న ప్రాంతాలన్నీ సైనిక బలగాలు స్వాధీనపరచుకుంటున్నాయి. అమిత్ షా అన్నట్లుగా మావోస్ట్ పార్టీ కావచ్చు..వారి ఉద్యమం కావచ్చు...'అంతిమ ఘడియల్లో' ఉన్నట్టు చెప్పుకోక తప్పదు. బీహార్, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, పశ్చిమబెంగాల్ తదితర రాష్ట్రాల్లో ఆదివాసులు, పేదప్రజలు, దళితులే మావోయిస్టులకు సానుభూతిపరులుగా ఉన్నారు. చాలా సందర్భాలలో ఆయా సానుభూతిపరులు సైతం ఎన్‌కౌంటర్లలో బలవుతున్నారు. మావోయిస్టుల ఏరివేత పేరిట భద్రతా దళాల అణచివేత చర్యలపై పౌర సమాజంలో పెద్దగా ఆందోళన వ్యక్తం కావడం లేదు. నిజానికి ప్రజల సమస్యలను ఎత్తుకున్న సమయంలో పీపుల్స వార్‌కు ప్రజల అండదండలు లభించాయి. రిక్రూట్‌మెంట్ దక్కింది. వారి పోరాటలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రజలు అండగా నిలిచారు. కాలక్రమంలో వారు దూరం కావడంతో మావోయిస్టుల ఉనికి కూడా కోల్పోతూ వస్తున్నారు. అందుకే దండకారణ్యంలో రక్తపుటేరులు పారుతున్నాయి. కాల్పుల మోతలతో బస్తర్ అడవులు మార్మోగుతున్నాయి. అబూజ్ మఢ్ కేంద్రంగా రెండు దశాబ్దాలుగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న మావోయిస్టులను భద్రతా బలగాలు వరుస ఎన్‌కౌంటర్లలో చావుదెబ్బ తీస్తున్నాయి. గత ఏడాదిగా జరుగుతున్న ఎదురుకాల్పుల ఘటనల్లో ఇప్పటివరకు మూడు వందలకు పైగా మావోయిస్టులు హతమైనట్లు పోలీసుల రికార్డులు చెబుతున్నాయి. ఈ ఏడాది ఆరంభంనుంచీ గత ఇరవై రోజుల్లోనే మూడు ఎన్‌కౌంటర్లలో 44 మందికి పైగా మావోయిస్టులు అసువులు బాశారంటే పోలీసులు ఎంతలా పైచేయి సాధించారో అర్థం చేసుకోవచ్చు. దండకారణ్యాన్ని చుట్టుముట్టి కాల్పులకు పాల్పడుతున్న సాయుధ బలగాలకు వెరచి గత ఏడాది కాలంలో సుమారు 850 మంది మావోయిస్టులు లొంగిపోగా, పోలీసులు మరో 400 మందికి పైగా అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు, సిఆర్‌పిఎఫ్, కోబ్రా బలగాలు సంయుక్తంగా 'ఆపరేషన్ కగార్' పేరిట సాగిస్తున్న ముప్పేట దాడికి సాంకేతిక పరిజ్ఞానమూ తన వంతు సహకారం అందిస్తూండటంతో మావోయిస్టులు మూల్యం చెల్లించుకోక తప్పడం లేదు. కాకులు దూరని కారడవిలో 650కి పైగా బేస్ క్యాంపులు ఏర్పాటు చేసుకుని, భద్రతా బలగాలు గాలింపు జరుపుతున్నాయి. మావోయిస్టుల జాడ తెలియగానే విరుచుకుపడి మట్టుబెడుతున్నాయి. అబూజ్ మఢ్ అడవుల్లో మావోయిస్టుల జాడ పసిగట్టడంలో జిల్లా రిజర్వ్ గ్రూపు (డిఆర్‌జి)లదే కీలకపాత్ర. ముల్లును ముల్లుతోనే వెలికి తీయాలన్న ఉద్దేశంతో.. లొంగిపోయిన నక్సలైట్లను ఉపయోగించుకుని, మావోయిస్టుల జాడ కనిపెట్టేందుకు ఏర్పాటు చేసిందే ఈ డిఆర్‌జి. దట్టమైన అడవిలో ఏది ఎక్కడుందో డిఆర్‌జిలకు కొట్టినపిండి కావడంతో గాలింపు చర్యలలో వారినే ముందుభాగంలో ఉంచుతున్నారు. ఇప్పటివరకూ జరిగిన పలు ఎన్‌కౌంటర్లలో డిఆర్‌జిల సహకారం వల్లనే పోలీసులు పైచేయి సాధించారంటే అతిశయోక్తి కాదు. ఒకప్పుడు నక్సలిజం అనేక రాష్ట్రాల్లో ఊడలూనుకుని, ప్రభుత్వాలను గడగడలాడించిన మాట వాస్తవం. నక్సలైట్లు ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తూ, పోలీసులపైన, ఇన్ఫార్మర్లపైన మెరుపుదాడులు జరిపి మట్టుబెడుతూ పాలకులకు కంటిమీద కునుకు లేకుండా చేశారు. నక్సలైట్ల తుపాకులకు ఎందరో ప్రజాప్రతినిధులు బలైన సంఘటనలు కోకొల్లలు. ఒకప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సైతం సాయుధ పోరాట దాడులతో విలవిల్లాడింది. కారణాలేమైతేనేం, ఉభయ తెలుగురాష్ట్రాల్లో నక్సలైట్ల జోరు తగ్గి, చత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, బీహార్ వంటి రాష్ట్రాలకు విస్తరించింది. అడపాదడపా భద్రతాదళాలపై గెరిల్లా దాడులు చేస్తూ, మావోయిస్టులు ఉనికిని చాటుకుంటున్నారు. కేంద్రంలో మూడో దఫా అధికారంలోకి వచ్చిన ఎన్‌డిఎ ప్రభుత్వం మావోయిస్టులను తుడిచిపెట్టేందుకు కంకణం కట్టుకున్నట్లు చత్తీస్‌గఢ్ అడవుల్లో చోటు చేసుకుంటున్న వరుస ఎన్‌కౌంటర్లను బట్టి తెలుస్తోంది. వచ్చే ఏడాది మార్చి నెలలోగా మావోయిస్టులనుంచి చత్తీస్‌గఢ్‌కు విముక్తి కల్పిస్తామంటూ కేంద్ర హోం మంత్రి చేస్తున్న ప్రకటనలను కూడా ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవాలి. తెలంగాణతో సహా దేశంలోని అనేక ప్రాంతాల్లో కమ్యూనిస్టులు గతంలో సాయుధ పోరాటం చేశారు. వారు ప్రజల్లో ఉంటూ పోరాడారు. కాలక్రమంలో రాజకీయం మారింది. కమ్యూనిస్టులు కూడా మెల్లగా అంతమవుతున్నారు. సరళీకరణ ఆర్థిక విధానాల కారణంగా ప్రజలు బతుకుదెరువు కోసం దేశాన్ని దాటేస్తున్నారు.

## మహారాష్ట్రలో గిలైన్ బారె సింద్రోమ్ కలకలం

**ముంబయి,జనవరి27:** మహారాష్ట్రలో గిలైన్ బారె సింద్రోమ్ కలకలం సృష్టిస్తోంది. తాజాగా సోలాపుర్ జిల్లాకు చెందిన ఓ వ్యక్తి మరణించగా.. అందుకు జీబీఎస్ కారణమని అనుమానిస్తున్నట్లు వైద్య వర్గాలు వెల్లడించాయి. కలుషిత ఆహారం, నీటి ద్వారా ఆ బ్యాక్టీరియా సోకుతుంది. దాని బారిన పడిన వ్యక్తుల్లో డయేరియా, పొత్తికడుపు నొప్పి, జ్వరం, వాంతులు వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఆ ఇన్ఫెక్షన్‌కు రోగనిరోధక వ్యవస్థ ప్రతిస్పందించే క్రమంలోనే జరిగే పొరపాటే కొందరిలో జీబీఎస్‌కు దారితీస్తుంది. ప్రతీ వెయ్యి మందిలో ఒకరికే ఈ పరిస్థితి ఎదురవుతుంది.పుణెలో ఇప్పటివరకు నమోదైన జీబీఎస్ కేసుల సంఖ్య 101కి చేరుకుంది. వారిలో 16 మంది వెంటిలేటర్ మీద చికిత్స పొందుతున్నారు. మృతిచెందిన వ్యక్తి కూడా పుణెలోనే చికిత్స పొందాడు. బ్యాక్టీరియా, వైరల్ ఇన్ఫెక్షన్ కారణంగా బలహీన రోగనిరోధక శక్తి కలిగిఉన్న వ్యక్తులు ఈ జీబీఎస్ బారినపడే అవకాశాలు ఉంటాయని వైద్యులు వెల్లడించారు. శరీరానికి సోకిన ఇన్ఫెక్షన్‌కు ప్రతిస్పందించే రోగ నిరోధక వ్యవస్థ పొరపాటున నరాలపై దాడి చేసే అరుదైన పరిస్థితి ఇది. ఆ రుగ్మత బారినపడిన వారికి ఒళ్లంతా తిమ్మిరిగా అనిపించడం, కండరాలు బలహీనంగా మారడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. డయేరియాకు కారణమయ్యే కాంపిలోబ్యాక్టర్ జెజునీ బ్యాక్టీరియా జీబీఎస్‌కు కారణం కావొచ్చని వైద్యులు అనుమానిస్తున్నారు. ప్రజలు భయాందోళనకు గురికావొద్దని, జీబీఎస్ అంటువ్యాధి కాదని, చికిత్సతో నయం చేయొచ్చని వైద్యులు వెల్లడించారు.

TEL TEL RNI NO 12283 VEMULA AYODHYA RAMULU TOLI PODDU PUBLICATIONS AND PRINTERS GRAPHICS
H-NO 1-6-155/43/45/4 NANDI NAGAR POST:MANDAL DIST: MAHABUBABAD TELANGANA STATE INDIA PIN CODE 506 101